

ఆడిపాడి ఆనందంగా..



యైటింక్లయిన్‌కాలనీ: సద్దుల బతుకమ్మ ప్రతీ ఒక్కరూ కుటుంబ సమేతంతో సంతోషంగా జరుపుకునే పండుగ. బతుకమ్మ పండుగ వచ్చిందంటే కొత్తగా పెళ్లి చేసుకున్న వారు తల్లిగారి ఇంటికి వచ్చి అక్కాచెల్లెళ్లతో, అన్నదమ్ములతో పాటు తమతో పాటు చదువుకున్న పూర్వ స్నేహితులతో కలిసి ఆడిపాడి ఆనందంగా జరుపుకుంటారు.

– తాళ్ల కల్పన, పోతనకాలనీ, న్యూమారేడుపాక

పెద్ద బతుకమ్మ కోసం తాపత్రయం



సుల్తానాబాద్: చిన్న బతుకమ్మ మొదలైన నాటి నుంచి అన్న, తమ్ముడు, నాన్న వెళ్లి పూలు తీసుకువస్తారు. సద్దుల బతుకమ్మకు అందరికంటే పెద్ద బతుకమ్మ పేర్చేలా తాపత్రయ పడతాం. మా కాలనీ పక్కనున్న చెరువులో నిమజ్జనం చేస్తాం.

– కె.అక్షయ, విద్యార్థిని

స్నేహితులతో సరదాగా..



రామగుండం: సద్దుల బతుకమ్మ పండుగ అంటేనే ఇంటిల్లిపాది సందడిగా ఉంటుంది. సద్దుల బతుకమ్మ రోజు చిన్ననాటి స్నేహితులను కలుసుకునే అవకాశం వస్తుంది. తల్లిగారింట్లో వారం రోజుల పాటు సంబురంగా గడుస్తుంది. ఇంటిల్లిపాది అందరినీ కలిపే పండుగ బతుకమ్మ.

– శశిప్రియ, ఐవోసీ

ఈఎస్‌ఐలో వసతులు కరువు

- ఏడాదిగా డాక్టర్ లేని వైనం
- దృష్టిసారించని అధికారులు
- ఇదీ బసంత్‌నగర్ ఈఎస్‌ఐ ఆసుపత్రి పరిస్థితి



మందుల కోసం ఆసుపత్రికి వచ్చిన కార్మికులు (ఫైల్)

పాలకుర్తి: పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారైంది బసంత్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్వహణ తీరు. పేరుకు ఆసుపత్రి అయినప్పటికీ కనీస వసతులు లేకపోవడంతో చికిత్స కోసం వచ్చే రోగులు, అందులో పనిచేసే సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిగా వైద్యుడి పోస్టుఖాళీ..

బసంత్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రి పరిధిలో దాదాపు 6వేల మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. స్థానిక కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు, కన్నాల టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ షాపింగ్‌మాల్స్, ఇతర సంస్థల్లో పనిచేసే సిబ్బంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ప్రస్తుతం ఆసుపత్రికి వైద్యసేవల కోసం వచ్చే పేషెంట్లను పరీక్షించేందుకు స్థానికంగా వైద్యుడు లేడు. దాదాపు ఏడాదిన్నర క్రితం ఇక్కడ పనిచేసిన వైద్యుడు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. అప్పటి నుంచి డిస్పెన్సరీలో వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. స్థానికంగా వైద్యులకు, సిబ్బందికి సౌకర్యాలు లేనందునే ఇక్కడ పోస్టింగ్ తీసుకునేందుకు డాక్టర్లు విముఖత చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

కనీస వసతులు కరువు..

బసంత్‌నగర్ ఈఎస్‌ఐ ఆసుపత్రికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఆసుపత్రి భవనాన్ని 2008లో కేశోరాం కంపెనీ నిర్మించి ఇవ్వగా అద్దె ప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. అయితే ఈభవనంలోని గదుల నిండా మందులు, ఇతర పరికరాలతో నిండిపోవడంతో ఆసుపత్రి సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోగులు వేచి ఉండేందుకు ప్రత్యేక గది లేదు. కనీసం బెడ్ సౌకర్యం, టాయిలెట్స్ కూడా లేకపోవడం సంబంధితశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కేవలం రోగులు చెప్పిన విషయాన్ని బట్టి అందుకు అనుగుణంగా మందులు అందజేయడం తప్ప ఎలాంటి రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఎలాంటి పరికరాలు లేవు. షుగర్, హెచ్.బి పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. ఈఎస్‌ఐ పరిధిలోని రోగులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని నాచారం ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్లడం లేదంటే సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని తదనంతరం రీయింబర్స్‌మెంట్ పొందడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి ఆసుపత్రికి వైద్యుడిని నియమించి, సౌకర్యాలు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి మావంతు కృషిచేస్తాం



కేశోరాం సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికయ్యాం. బసంత్‌నగర్ ఈఎస్‌ఐ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక కార్మికులు, వారి కుటుంబసభ్యులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిసింది. ఏడాదిగా డాక్టర్ లేక కేవలం మందుల పంపిణీకే పరిమితమైన ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యల పరిష్కారానికి మావంతు కృషిచేస్తాం.

– కౌశికహరి, కేశోరాం సిమెంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు



జ్యోతినగర్: పూజలో మాలధారులు



రామగుండం: పూజల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



జూలపల్లి: పూజలు చేస్తున్న భక్తులు



యైటింక్లయిన్‌కాలనీ: పూజల్లో పాల్గొన్న భక్తులు



ధర్మారం: హోమంలో దంపతులు



సుల్తానాబాద్‌లో ప్రత్యేక పూజలు

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

పెద్దపల్లిరూరల్/రామగుండం/ధర్మారం/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/పాలకుర్తి/జ్యోతినగర్/జూలపల్లి: దుర్గామాత నవరాత్రోత్సవాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లలితా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారికి అన్నిరకాల కూరగాయలతో అలంకరణ చేశారు. మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు.

మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన పెర్క శ్యాం



పరామర్శిస్తున్న టీపీసీసీ కార్యదర్శి పెర్కశ్యాం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం పెద్దపల్లికి చెందిన టీపీసీసీ కార్యదర్శి పెర్కశ్యాం పరామర్శించారు. ఇటీవల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి మరణించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అంబేడ్కర్ సంఘాలను బలోపేతం చేస్తాం

రామగుండం: అంబేడ్కర్ సంఘాలను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య అన్నారు. అంతర్గాం మండలం సోమనపల్లిలో ఆదివారం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఉప్పులేటి కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఉప్పులేటి సాగర్, రమేశ్, కోశాధికారి పెగడపల్లి చిన్న, కార్యదర్శులు ఉప్పులేటి నర్సయ్య, అధికార ప్రతినిధి ముల్కల్ల ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. సంఘం మండల ఇన్‌చార్జి ఉప్పులేటి పవన్, దళిత సామాజిక హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్, కోరె శంకర్, భూపెల్లి రాజేశ్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతి ప్రదానం చేస్తున్న జీఎం డి.బైద్య

రామగిరి: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి విజేతలుగా నిలవాలని సింగరేణి ఎక్స్‌ప్లోజివ్స్ జీఎం డి.బైద్య అన్నారు. సెంటనరీకాలనీలోని జేఎన్టీయూ కళాశాలలో అండర్–16 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన సెంటనరీకాలనీ జట్టుకు ఆదివారం బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థి దశ నుంచే ఆటలపై ఆసక్తిని పెంపొందించుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన పల్లె సాక్షిత్‌రావు ఆధ్వర్యంలో టీ–20 క్రికెట్ పోటీలు నిర్వహించగా ఆదివారం ఫైనల్‌లో గోదావరిఖని, సెంటనరీకాలనీ జట్లు తలపడ్డాయి. సెంటనరీకాలనీ జట్టు విజయం సాధించింది. జేఎన్టీయూ ఫ్యాకల్టీ బుద్దుల రవీందర్, పీఈటీ శేఖర్, తన్నీరు ప్రదీప్, నందనవేన కుమార్, జగ్గా పాల్గొన్నారు.







రక్తకణాలు దానం చేస్తున్న వైకే ఫౌండేషన్ సభ్యులు

యువకుల రక్తదానం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్ యువకులు అత్యవసర పరిస్థితిలో రక్తం, రక్తకణాలు దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వైకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గం తారబాయ్ అనే పేషెంట్‌కు శనివారం అర్ధరాత్రి అత్యవసరంగా ఎ ప్లస్ రక్తకణాలు కావాలని వైద్యులు సూచించారు. బాధితులు వైకే ఫౌండేషన్ సంస్థను సంప్రదించగా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్ స్పందించి సభ్యులు అనిల్, సాయి, వినీత్‌కు సమాచారం అందించారు. అదేరాత్రి తక్షణమే వారు మంచిర్యాలకు వెళ్లి రక్తకణాలు దానం చేశారు. ఆదివారం వారిని ఫౌండేషన్ అధ్యక్షుడితో పాటు సభ్యులు అభినందించారు.

అర్హులంతా ‘మండలి’ ఓటర్లుగా నమోదు చేసుకోండి



ఓటరుగా నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీజేపీ నాయకులు శివంగారి సతీశ్, పర్శ సమ్మయ్య, దిలీప్, శ్రీనివాసరావు, పల్లె సదానందం కోరారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. పట్టభద్రులైన విద్యావంతులంతా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు క్రాంతికుమార్, రాపర్తి గోపి, మంథని కృష్ణ, రమేశ్, నరేశ్, ఫహీం ఉన్నారు.

అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి



అభినందన పత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్

కోల్‌సిటీ: ప్రతీఒక్కరు అపోహలు వీడి.. నేత్రదానం చేయాలని రామగుండం ఐఎంఏ డాక్టర్ దామెర అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన పరుష పురుషోత్తం అనే వ్యాపారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు మృతుని నేత్రాలను దానం చేశారు. ఆదివారం నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కె.రాజేందర్, సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, అడ్వకేట్ నూతి సురేశ్‌కుమార్, సదాశయ పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్ర, అవయవ, శరీరదానంపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందజేశారు. ప్రతినిధులు రాము, రఘు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



అభినందిస్తున్న కరస్పాండెంట్ సిజ్జు ఎస్.నాయర్

సుల్తానాబాద్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు కేరళ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ సిజ్జు ఎస్ నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్ నాయర్ తెలిపారు. మండల కేంద్రంలోని కేరళ మోడల్ స్కూల్ ఆవరణలో ఎంపికైన విద్యార్థులను ఆదివారం అభినందించారు. అసోసియేషన్ గేమ్ రామగుండం మండలం జ్యోతినగర్ జెడ్పీ హైస్కూల్‌లో 2న జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 7న హైదరాబాద్‌లో జరగనున్న స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ మీట్‌లో విద్యార్థులు 600 మీటర్ల పరుగు పందెంలో ప్రచేతన్, లాంగ్ జంప్‌లో విగ్నేష్, సృజన, షార్ట్‌పుట్‌లో గాయత్రి, 500 మీటర్ల పరుగు పందెంలో వైశాలి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

సుల్తానాబాద్: ఆర్యవైశ్యులు సామాజిక సేవలు అందించడంలో ముందుంటున్నారని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ ట్రెజరర్ పొట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో రీజియన్ చైర్మన్ అల్లంకి లింగమూర్తి పద్మావతి దంపతులతో కార్యక్రమం నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా ఉండి సేవా కార్యక్రమాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాసును సన్మానించారు. వాసవి క్లబ్ పవిత్రం శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్, మధుకర్, జిల్లా కేబినెట్ సెక్రటరీ లచ్చయ్య, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ కిషోర్, జిల్లా కేబినెట్ జాయింట్ సెక్రటరీ వాణి, సుల్తానాబాద్ టౌన్ అధ్యక్షుడు భాస్కర్ ఉన్నారు.

నేడు ఉచిత చేపపిల్లల విడుదల

మంథని: మంథనిలోని తమ్మిచెరువులో సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఉచిత చేపపిల్లలు వేయనున్నట్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతికుమార్ తెలిపారు. మత్స్యశాఖ రాష్ట్ర చైర్మన్ సాయికుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఉచిత మెగా కంటిశిబిరం

గోదావరిఖనిటౌన్: ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 32వ డివిజన్‌లో కార్పొరేటర్ అయిత శివకుమార్ ఉచిత మెగా కంటి శిబిరం నిర్వహించారు. 220 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. వీరికి దసరా తర్వాత హైదరాబాద్‌లోని శంకర ఐ విజన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. అనంతరం డయాలసిస్‌తో బాధపడుతున్న గోదావరిఖని ప్రెస్‌క్లబ్ బాయ్ దస్తగిరికి 50కిలోల బియ్యం అందజేశారు. సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ ఎం.విజయానంద్, స్వచ్ఛంద సంఘాల నిర్వాహకులు కార్పొరేటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

• ఆటోడ్రైవర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి ఆటోడ్రైవర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం సీఐటీయూ అనుబంధ పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొన్నాల ఉపేందర్, కార్యదర్శిగా బుర్ర చిరంజీవి, కోశాధికారిగా పొన్నాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నంపెల్లి శ్రీను, రాపాక లింగయ్య, సహాయ కార్యదర్శులుగా కొమురయ్య, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి, డ్రైవర్లు రాకేశ్, వెంకటేశ్, శ్రావణ్, శివ, గణేశ్ ప్రశాంత్ ఉన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని: మంథని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో సోమవారం ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లయ్య తెలిపారు. పద్మశాలీ వీధి, పెంజేరుకట్ట, స్టేట్ బ్యాంకు ఏరియాలో మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

• దొంగతుర్తి యువజన గౌడ సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామ గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా పాలకుర్తి ప్రశాంత్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా బండి శ్రీకాంత్, రంగు నరేశ్, ప్రధాన కార్యదర్శిగా బొంగాని అరుణ్, కోశాధికారిగా అమరగోని మహేశ్, సంయుక్త కార్యదర్శిగా పల్లె చందు, కార్యవర్గసభ్యులుగా ముక్కెర విష్ణువర్ధన్, బొమ్మగాని సంజయ్, నేరేళ్ల మహేందర్, బొంగాని జానీ, పాలకుర్తి అరవింద్, చంద్రమౌళిని ఎన్నుకున్నారు.

గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడిగా ఆశాలు

దొంగతుర్తి గౌడసంఘం అధ్యక్షుడిగా ముక్కెర ఆశాలు, ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి తిరుపతి, సభ్యులుగా బాలసాని తిరుపతి, పాలకుర్తి రాజయ్య, బాలసాని లింగయ్య, బొమ్మగాని నర్సింగం, బండి కొమురయ్య, ఇల్లందుల నారాయణ, నేరేళ్ల మల్లేశం, ఆకుల తిరుపతిని ఎన్నుకున్నారు.

• అంబేడ్కర్ యువజన సంఘ కార్యవర్గం

జూలపల్లి: మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెరువట్ల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా మానుమండ్ల దుర్గయ్య, మోదుంపెల్లి గంగమల్లు, ప్రధాన కార్యదర్శిగా మనుమండ్ల కనుకయ్య, కోశాధికారిగా ఎదుల్ల మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా నెరువట్ల దుర్గయ్య, ప్రచార కార్యదర్శులుగా నెరువట్ల మల్లేశం, దుర్గయ్య, సభ్యులుగా నాతరి అంజయ్య, శ్రీకాంత్, వేణు, నర్సింగం, నెరువట్ల అంజయ్యను ఎన్నుకున్నారు.

• ఇండియా మిషన్ వార్షిక సభలు విజయవంతం చేయండి

మంథని: జిల్లా కేంద్రంలో సోమవారం నుంచి 10 తేదీ వరకు నిర్వహించే ఇండియా మిషన్ వార్షిక సభలను విజయవంతం చేయాలని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ కోరారు. పెద్దపల్లి ఇండియా మిషన్ స్కూల్‌లో ఐఎంఐ, ఎఫ్ఈసీ సంయుక్తంగా నిర్వహించే మిషన్ వార్షిక సభలను విజయవంతం చేయాలని కోరారు.

• నిత్యావసరాలు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీసత్య సాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అమృత కలశాలు పంపిణీ చేశారు. కాలనీలోని 15మంది నిరుపేద కుటుంబాలకు అమృత కలశాల పేరుతో నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. సేవాసమితి కన్వీనర్ రమేశ్, బుగ్గాజీ, మహేందర్‌రెడ్డి, కిష్టయ్య, మల్లయ్య, లక్ష్మణ్, మోహన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముళ్లపొదల తొలగింపు



జేసీబీతో ముళ్లపొదల తొలగింపు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట–ఇదులాపూర్ గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గుబురుగా పెరిగిన ముళ్లపొదలను ఆదివారం జేసీబీతో తొలగించారు. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలతో వ్యవసాయదారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యేకు విన్నవించడతో వెంటనే తొలగించాలని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌ను ఆదేశించడంతో జేసీబీతో తొలగించారు.

మహిళల రక్షణకు భరోసాగా షీటీం



అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుల్ స్నేహలత

జ్యోతినగర్: మహిళల రక్షణ కోసం షీటీం భరోసాగా ఉంటుందని షీటీం కానిస్టేబుల్ స్నేహలత అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని న్యూట్రిషన్ సెంటర్‌లో ఆదివారం మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహిళల రక్షణ కోసం ప్రతీరోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాతో పాటు జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీ టీం నిరంతరం విధులు నిర్వహిస్తుందని తెలిపారు. మహిళలు ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. షీటీం సిబ్బంది సురేశ్, న్యూట్రిషన్ సెంటర్ సీనియర్ వెల్‌నెస్ కోచ్ ప్రేమలత పాల్గొన్నారు.

వ్యాన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన అసోసియేషన్ నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఖరారైంది. అధ్యక్షుడిగా ఆరిఫ్ అలీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఠాకూర్ బాలాజీసింగ్, ఉపాధ్యక్షుడిగా అజయ్, జాయింట్ సెక్రటరీగా చంద్రబాబును ఎన్నుకున్నారు. వ్యాన్ ఓనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా పాటుపడతానని అధ్యక్షుడు ఆరిఫ్ పేర్కొన్నారు.

వాసవి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



వేడుకల్లో విద్యార్థులు, లెక్చరర్లు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తంగేడు, గునుగు, తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఉయ్యాల పాటలతో దాండియా ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జక్కుల కుమారస్వామి, కరస్పాండెంట్ ఆది ప్రసాదరావు, సిబ్బంది కిరణ్, మేఘన, కోమల, మానస, వెన్నెల, లావణ్య, అరవింద్, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

యాదగిరి శ్రీనివాస్‌కు కర్షకరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న యాదగిరి శ్రీనివాస్

రామగిరి: మండలంలోని కల్వచర్లకు చెందిన రైతు యాదగిరి శ్రీనివాస్ కర్షకరత్న అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ 2024 సంవత్సరానికి గాను తిరుపతిలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ దక్షిణ భారతదేశ 8వ సాహిత్య సమ్మేళనంలో నిర్వాహకులు శ్రీనివాస్‌కు అవార్డు అందజేశారు. వారసత్వ దేశవాళీ వరి విత్తనాలను భావితరాలకు అందించాలన్న తపనతో తగిన జాగ్రతలు తీసుకుంటూ సాగు చేస్తున్న శ్రీనివాస్ కృషి అభినందనీయమని నిర్వాహకులు కొనియాడారు. శ్రీనివాస్ కర్షకరత్న అవార్డుకు ఎంపికవడంపై మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.